క్లుప్తంగా

ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీధర్‌కు స్వాగతం పలికిన లావణ్యవేణి



ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీధర్‌కు మొక్క అందజేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ లావణ్య వేణి

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాకు విచ్చేసిన ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రెటరి బి.శ్రీధర్‌కు ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి బుధవారం పూలమొక్కను అందించి స్వాగతించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్ కె.ఖాజావలి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకటేశ్వరరావు, ఏలూరు తహసీల్దార్ బి.సోమశేఖర్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలో కైకరం విద్యార్థి ప్రతిభ

ఉంగుటూరు: కైకరం హైస్కూలు విద్యార్థి కామాటి లోహిత్ మణికంఠ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలో ప్రతిభ చాటి ప్రశంసాపత్రం అందుకున్నాడు. స్కూలు గేమ్స్ ఫెడరే షన్ అండర్ 14 విభాగంలో ఇటీవల బ్రాహ్మణగూడెంలో నిర్వహించిన పోటీల్లో మణికంఠ పాల్గొని సత్తాచాటారు. జిల్లాస్థాయి పోటీలో ఎంపికై, శ్రీకాకుళం జిల్లా కేశవరావు పేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొని ప్రశాంసాపత్రం సాధించారు. విద్యార్థి మణికంఠను, శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు నాగసుధ, ఇ.పాపాయమ్మను హెచ్‌ఎం అభినందించారు.

విద్యార్థులు ర్యాంగింగ్‌కి దూరంగా ఉండాలి

దెందులూరు: విద్యార్థులు ఎట్టి పరిస్థితిల్లోనూ ర్యాంగింగ్ జోలికి వెళ్లరాదని, జూనియర్లు, సీనియర్లు కుటుంబ సభ్యుల మాదిరిగా కలిసిమెలసి ఉండాలని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నతానియేలు అన్నారు. బుధవారం కళాశాలలో ఫ్రెషర్స్ వేడుకలు నిర్వహించారు. సీనియర్ విద్యార్థులు నూతనంగా కాలేజికి వచ్చిన విద్యార్థులను ఘనంగా ఆహ్వానించారు. సీనియర్లకు జూనియర్లు వీడ్కోలు పలికారు. ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. గిరిబాబు, గన్నవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. నిర్మల కుమారి మాట్లాడుతూ విద్యార్థులు నిరంతర సాధన, పట్టుదల క్రమశిక్షణతో ఎంచుకున్న లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలన్నారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి

పెదవేగి : విలువలతో కూడిన విద్య అందించాలని ఎంఈఓ చల్లగొళ్ల బుద్ద వాస్ అన్నారు. బుధవారం పెదవేగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముండూరు, పెదవేగి, కూచిపూడి, కాంప్లెక్స్ ల పరిధిలోని ఉపాధ్యాయులకు ఎంఈఓ సమావేశం నిర్వహించారు.

సీఎం జగన్‌తోనే మహిళా సాధికారత

ఎమ్మెల్యే ఆళ్ల నాని



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళాసాధికారతకు విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో 129వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 21వ డివిజన్‌లో కార్పొరేటర్ అన్నపనేని భారతి, పార్టీ నాయకులు అన్నపనేని రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో ఎమ్మెల్యే నాని అడిగి తెలుసుకున్నారు. మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ రాజకీయ రంగంలోని 50 శాతం సీట్లు కేటాయించారని, ఆర్థికంగా నిలదొక్కుకునేలా అనేక సంక్షేమ పథకాలను మహిళల పేరిట అందిస్తూ అండగా నిలిచారని వివరించారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించేలా ఉపాధి అవకాశాలు కల్పిస్తూ మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కుటుంబం అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో పథకాలన్నీ మహిళల ఖాతాల్లోనే నేరుగా జమ చేశారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ డ్వాక్రా రుణమాఫీ, బ్యాంకు రుణాలు మంజూరు చేయడం, అమ్మఒడి, విద్యాదీవెన, కాపునేస్తం, చేయూత, ఈబీసీ నేస్తం వంటి వాటిని మహిళలకే అందజేశారని వివరించారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్ బాబు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులపే వలంటీర్లు ఉన్నారు.

లబ్ధిదారులకు క్లీనింగ్ యంత్రాల అందజేత



లబ్ధిదారులకు క్లీనింగ్ యంత్ర వాహనాలను అందజేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ లావణ్యవేణి

ఏలూరు (మెట్రో): మురుగు నీరు, చెత్త నిర్మూలన కోసం మురుగుశుద్ధి వాహనాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో స్వచ్ఛత ఉద్యమి యోజన కింద ఎన్ఎస్‌కేఎఫ్ డీసీ ఆర్థిక సాయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూలు కులాల ఆర్థిక సంస్థ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు మూడు వేల లీటర్ల కెపాసిటీ గల డిసల్టింగ్ మురుగుశుద్ధి వాహనాలను అందజేశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మురుగునీరు, చెత్తనిర్మూలనా వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. వాహనం విలువ రూ.31.67 లక్షలు కాగా ఇందులో సబ్సిడీ కింద రూ.15.06 లక్షలు, ఎన్ఎస్ కేఎఫ్ డీసీ రుణం కింద రూ.16.61 లక్షలు ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మోహన్‌రావు, నగరపాలక సంస్థ కమీషనరు ఎస్ వెంకటకృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ కుముదినిసింగ్, మేతర అజయ్‌బాబు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, నూజివీడు మున్సిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.

వర్ధినీడి సాయిని పరామర్శించిన వాసుబాబు

భీమడోలు: భీమడోలు వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వర్ధినేడిసాయిని బుధవారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పరామర్శించారు. ఇటీవల వర్ధినేడి సాయి తండ్రి రిటైర్డ్ టీచర్ వర్ధినేడి కృష్ణమూర్తి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో భీమడోలులోని సాయి ఇంటికివెళ్లి అతనితో పాటు కుటుంబ సభ్యులను వాసుబాబు పరామర్శించి ఓదార్చారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

భీమడోలు: కేంద్ర ప్రభుత్వ పథకాలకు అర్హత గల ప్రతి ఒక్కరికీ పథకాలు చేరేలా సచివాలయ ఉద్యోగులు తమ వంతు కృషి చేయాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. మండలంలోని దుద్దేపూడి, కోడూరుపాడు, కోరుకల్లు గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎల్‌ఈడీ స్క్రీన్‌తో కూడిన ప్రచార రథం గ్రామాల్లో పర్యటించింది. కోడూరుపాడు, దుద్దేపూడి గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలకు సర్పంచులు మానుకొండ నాగేశ్వరరావు, నీలం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలు వాటి అమలు, ఇతర అంశాలపై గ్రామసభలో వివరించారు. వ్యవసాయ శాఖ పరిధిలో ఆధునాతన సేద్యంతో భాగంగా వినియోగించే డ్రోన్ సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ సుందరి, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి, ఎంపీటీసీ విజయభాను, గ్రామ కార్యద ర్శి డి.వెంకట్రావు, బీజేపీ మహిళా జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణకుమారి, మండల బీజేపీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌పటేల్ పాల్గొన్నారు.

వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర

దెందులూరు: గాలాయిగూడెంలో వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌బీకేలో గాలాయిగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సంకల్ప యాత్ర ప్రాధాన్యతను ఎంపీటీసీ సొంగా ప్రమీలా రాణి వెంకటేశ్వరరావు వివరించారు.

ఓటు హక్కుపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సుబ్బారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని, ఓటు విలువను తెలుసుకోవాలని, తమ ఓటు ద్వారా సంక్షేమాన్ని అందించే పాలకులను ఎన్నుకోవాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, ఏలూరు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి కేఎస్ఎస్ సుబ్బారావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు వినియోగంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏలూరు తహసీల్దార్ బి.సోమశేఖర్ మాట్లాడుతూ ఓటరు నమోదుకు సంబంధించి వినియోగించే 6, 7, 8 ఫారమ్‌ల గురించి వివరించారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ఓటరు నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వం, రంగోలి పోటీలు నిర్వహించి విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు అధ్యక్షత వహించగా, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదవర్గాల అభ్యున్నతికి సీఎం కృషి



సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన పిల్లంగోళ్ల శ్రీదేవి, విజయనిర్మల, సదానందం

ఏలూరు టౌన్: పేదవర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని వైఎస్సార్ సీపీ ఏలూరు క్లస్టర్–1 మహిళా అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీదేవి అన్నారు. ఏలూరు వన్‌టౌన్ సచివాలయం – 43 పరిధిలో వై ఏపీ నీడ్స్‌జగన్ అనే కార్యక్రమం బుధవారం నర్విహించారు. కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల ఆధ్వర్యంలో డివిజన్‌లోని పార్టీ నాయకులు, లబ్ధిదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. డివిజన్‌లో అమలైన సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలను పక్కాగా అమలు చేసి తన చిత్తశుద్ధిని చాటుకున్నారని, మరోసారి ఆయన్ని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి మహిళా అండగా నిలవాలని కోరారు. గతంలో చంద్రబాబు డ్వాక్రా రుణ మాఫీ పేరుతో ఘోరంగా మోసం చేశారని, ఎన్నికలకు నాలుగు నెలల ముందు హడావుడి చేస్తూ పసుపు, కుంకుమ పేరుతో మభ్య పెట్టే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. కానీ, ముఖ్యమంత్రి జగనన్న ఇచ్చిన హామీని నెరవేరుస్తూ డ్వాక్రా రుణమాఫీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ క్లస్టర్–1 కన్వీనర్ మోటమర్రి సదానంద కుమార్, క్లస్టర్–1 మహిళా ఉపాధ్యక్షురాలు మంగమ్మ, విజయ్, పార్టీ నాయకులు, లబ్ధిదారులు ఉన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

ఎస్పీ మేరిప్రశాంతి



సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ మేరి ప్రశాంతి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో నేరాల నియంత్రణకు పోలీస్ వ్యవస్థ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తుందని ఎస్పీ డి.మేరిప్రశాంతి అన్నారు. ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి నెలవారీ నేరసమీక్షా సమావేశం బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్వహించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం సబ్‌డివిజన్ పరిధిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. మహిళలపై నేరాలను నిరోధానికి తీసుకునే చర్యలపై చర్చించారు. బాలికల మిస్సింగ్ కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఆచూకి తెలుసుకునేందుకు కృషి చేయాలని సూచించారు. నిందితులకు సత్వరమే శిక్ష పడేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా ఘటనా స్థలాన్ని పరిశీలించడం, సాక్ష్యాధారాల సేకరణ, నిందితుల అరెస్టు, దర్యాప్తు, చార్జిషీటు దాఖలు, కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టడంలో పోలీస్ సిబ్బంది తమ ప్రతిభను చాటుకోవాలని అన్నారు. సివిల్ కేసుల్లో పోలీసులు చట్టం మేరకే తమ పాత్ర పోషించాలని ఆదేశించారు. రౌడీషీటర్లపై నిఘా పెంచడంతో పాటువారిలో పరివర్తన తీసుకొచ్చేందుకు అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్‌లోకి వచ్చే బాధితులకు న్యాయం చేయాలని అన్నారు. పోలీస్ సిబ్బంది అవినీతి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, పోలీస్ ప్రతిష్టను దిగజార్చేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఈబీ ఆధ్వర్యంలో జిల్లాలోని నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని ఆదేశించారు. గంజాయి, మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకోవాలని చెప్పారు. మద్యం అక్రమ రవాణా, సారా విక్రయాలు, ప్రభుత్వం నిషేధించిన ఖైనీ, గుట్కాల విక్రయాలపై కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. సమీక్షలో డీసీఆర్‌బీ సీఐ ఎం సుబ్బారావు, దుర్గాప్రసాద్, ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, జంగారెడ్డిగూడెం డీఎస్పీ ధనుంజయుడు, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స



రెడ్‌క్రాస్‌లో తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స

ఏలూరు టౌన్: అనారోగ్య సమస్యతో బాధపడుతున్న తలసేమియా చిన్నారులకు రెడ్‌క్రాస్ భరోసా ఇస్తుందని రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా కేంద్రంలో బుధవారం 15 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స వైద్యులు ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకు అవసరమైన సమయంలో రక్తమార్పిడి చికిత్స అందిస్తున్నట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారులకు ప్రతి ఒక్కరూ సాయం చేయాలని కోరారు. బుధవారం తలసేమియా బాధిత చిన్నారులకు మానవత సంస్థ ఆధ్వర్యంలో ఉచిత భోజనం ఏర్పాటు చేశారని తెలిపారు. ఏలూరు మానవత సంస్థ చైర్‌పర్సన్ అడుసుమిల్లి నిర్మల, యార్లగడ్డ కృష్ణమోహన్ దంపతులకు రెడ్‌క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ సీతారామ్, గౌరవ కార్యదర్శి కడియాల కృష్ణారావు తదితరులున్నారు.

సేవాలోపానికి రూ.50 వేల పరిహారం చెల్లించండి



తీర్పును వెలువరిస్తున్న వినియోగదారుల కమిషన్ చైర్మన్ కోదండ రామ్మూర్తి, సభ్యులు

ఏలూరు (టూటౌన్): సకాలంలో కొరియర్ బట్వాడా చేయకపోవడంతో సల్సార్ యూనివర్సిటీలో ప్రవేశం కోల్పోయిన వ్యక్తికి రూ.50 వేలు పరిహారం, మరో రూ.5 వేలు ఖర్చుల కింద చెల్లించాలని డీటీడీసీ సంస్థ, బెంగుళూరు వారికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వినియోగదారుల కమిషన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కేసు పూర్వాపరాలు విచారించిన కమిషన్ చైర్మన్ డి.కోదండ రామమూర్తి, సభ్యులు ఎస్ సురేష్ కుమార్, కేఎస్ఎన్ లక్ష్మి తీర్పు వెలువరించారు. కేసు వివరాల్లోకి వెళితే.. నర్సాపురానికి చెందిన కొప్పర్తి భాస్కరనారాయణ కుమారుడు కృష్ణ శ్రీనివాస్, హైదరాబాద్‌లోని సల్సార్ యూనివర్సిటీలో బీఏ, ఎల్ఎల్‌బీ ప్రవేశ పరీక్షలో 96.6 శాతం మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. సదరు యూనివర్సిటీలో ప్రవేశ దరఖాస్తును నర్సాపురంలోని డీటీడీసీ కొరియర్ ద్వారా 2021 ఆగస్టు 3న యూనివర్సిటీకి పంపించారు. దరఖాస్తు గడువు ఐదో తేదీ ముగిసిన తర్వాత 6వ తేదీ సాయంత్రం 7.35 గంటలకు దరఖాస్తును కొరియర్ సంస్థ సల్సార్ యూనివర్సిటీకి అందజేసింది. యూనివర్సిటీలో ప్రవేశానికి 93.8 శాతం నుంచి 98.6 శాతం మార్కులు సాధించిన వారిని ఎంపిక చేశారు. సేవాలోపంతో సీటు సాధించలేకపోయిన కొప్పర్తి కృష్ణ శ్రీనివాస్ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు చూపుతున్న నన్నయ విశ్వవిద్యాలయం కరాటే పోటీల విజేతలు

ఉంగుటూరు: నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాల స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పరిశీలకులుగా బీఎల్ నారాయణ, ఇబ్రహీం, బేగ్ పనిచేశారు. పోటీల్లో 21 మంది పురుషులు, 18 మంది మహిళలు వేరు కళాశాలలు నుంచి ప్రాతినిధ్యం వహించారు. నన్నయ విశ్వవిద్యాలయం తరపున మహిళల నుంచి ఎస్.శరణ్య (ఆదిత్య, భీమవరం), కె.మహాలక్ష్మి, (ఆదిత్య, భీమవరం) ఎంప్రీతి శ్రీజ, (సెంట్‌థెరిసా, ఏలూరు), వె.మాధురి(కాకినాడ, ఎస్‌డీ కళాశాల), పి.శ్రీవిద్య (ఆర్ట్స్ కాలేజీ, రాజమండ్రి), నాగాలహరి(డైట్ కాలేజి, రాజమండ్రి), ఎంపికయ్యారని ఆర్గనైజింగు కార్యదర్శి, కళాశాల పిడి రాజమారిసన్ వివరించారు. పురుషుల విభాగంలో పి.పవన్‌కుమార్ (ఎస్ ఎ ఎస్ కళాశాల, నారాయణపురం), ఎల్ ప్రదీప్‌కుమార్ (ఆదిత్య, రాజమండ్రి), కె.ఎ.రామకృష్ణ, (డైట్ కాలేజి, రాజమండ్రి), సీహెచ్ శ్రీసత్యవంశీ(ఆదిత్య,భీమవరం), సీహెచ్ శరణ్ మణికంఠ (ఆదిత్య, భీమవరం), పి.విజ(ఆర్ట్స్ కాలేజి, రాజమండ్రి), బి.ప్రవీన్‌కుమార్ (గొల్లలమామిడాడ) విశ్వవిద్యాలయం తరపున ఎంపికయ్యారు. పోటీలను కళాశాల కమిటీ చైర్మన్ కూనపరాజు సీతారామరాజు, ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు ప్రారంభించారు. విజేతలకు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ వీటీకే విశ్వేశ్వరరావు, ఆర్గనైజింగు కార్యదర్శి రాజా మారిసన్ అందించారు.

వైభవంగా భక్తాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు



భక్తాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో అభిషేకం చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

ఉంగుటూరు: వేదమంత్రోచ్ఛరణ నడుమ గోపినాథపట్నంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో విశేష పూజలు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మూడో రోజైన బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పంచామృతాలతో క్షీరాభిషేకం మంత్రి కొట్టు సత్యనారాయణ నిర్వహించారు. ఈ పూజలన్నీ భక్తాంజనేయస్వామి, ఆయన వాహనమైన ఒంటె, సీతారామలక్ష్మణ విగ్రహాలకు నిర్వహించారు. ఆగమ వాచస్పతి డా.వేదాంతం రాజగోపాల చక్రవర్తి బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు. ఆరుగురు వేదాంత సంస్కృతి పండితులు రామాయణ పారాయణం నిర్విరామంగా చేస్తున్నారు. 32 మంది ద్వారకాతిరుమల నుంచి ప్రత్యేకంగా వచ్చిన రుత్వికులు హోమాలు నిర్వహించారు. గోపినాథపట్నం సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో శానిటేషన్ చేయిస్తున్నారు. రాష్ట్రంలోని పలు ఆలయాల ఈవోలు, ప్రజాప్రతినిధులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. గోపినాథపట్నంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

పెదపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను పూర్తి స్థాయిలో వివరించాల్సిన బాధ్యత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులపై ఉందని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం పెదపాడు ఎంపీపీ బత్తుల రత్న కుమారి అధ్యక్షత నిర్వహించారు. ఎంపీపీ శాఖల వారీగా వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. చైర్ పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ మండలంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో చేస్తున్నట్లు తెలిపారు. వంగాయగూడెం పెరికీడు రహదారి మినహా అన్ని రహదారులు పూర్తి చేశామన్నారు. ఎంపీపీ బత్తుల రత్నకుమారి మాట్లాడుతూ అధికారులంతా గ్రామ స్థాయి నాయకులతో సమన్వయం చేసుకుని పాలన అందించాలని కోరారు. బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, మండల ఉపాధ్యక్షులు అప్పన పద్మావతి, రెడ్డి స్వర్ణకుమారి, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07–10
బెండకాయలు	30	కంద	60
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	40
కాకర కాయలు	28–32	కీరా దోస	40
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	40	అల్లం	120
క్యాబేజీ	22	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	50	పాలకూర	10
దొండకాయలు	28	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	45–50	గోంగూర	06
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	28	బఠాణీ	--
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	52
పొట్లకాయ(1)	15–20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	15
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	28
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	13
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	00
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –తిరుపతి	16.00	4830	17